స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

కరీంనగర్ టౌన్, జనవరి 13: రాష్ట్రంలో బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని కరీంనగర్ స్పౌజ్ ఫోరం కన్వీనర్ మండల ఆనందం, కో కన్వీనర్ బుర్ర నాగరాజు, సభ్యులు ఉమాదేవి, లావణ్య, రాజేశం, రజిత, భిక్షపతి, లింగాల రాజు, పిడి కృష్ణ, రమేశ్, కేతిరి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంథనిలో కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మకర సంక్రమణ వేళలో..





● మొదలైన సంక్రాంతి సంబరాలు ● వాకిళ్లలో అందమైన ముగ్గులు ● నేడు భోగి, రేపు సంక్రాంతి

కరీంనగర్ కల్చరల్, జనవరి 13: సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజు మకర సంక్రాంతిగా పాటిస్తారు. ధనుర్మాసం పూర్తయి సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరం వైపుతిరిగే ఉత్తరాయణ పుణ్యకాలమే సంక్రాంతి. మార్గశిర, పుష్య మాసాల సంధికాలంలో హేమంత ఋతువులో వచ్చే ఈ పండుగ మూడు రోజులపాటు నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 14న భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ నిర్వహించుకుంటున్నారు. భోగి భాగ్యానికి, సంక్రాంతి సంపదకు, కనుమ కలిమికి చిహ్నంగా చెప్పే ఈ పండుగకు జనులు స్వాగతం పలుకనున్నారు.

● భోగ్యమైన భోగి..

భోగికి ముందు నుంచే భోగి పిడుకలు పెట్టి మధ్యలో రంధ్రం చేసి హారంగా తయారు చేస్తారు. పాతకు పాతర వేయడంలో భాగంగా పిడుకల హారంతోపాటు ఇంట్లోని నిరుపయోగ వస్తువులు, పాత సామానులు భోగి మంటల్లో వేస్తారు. విభూతి ధరిస్తారు. పిల్లలకు రేగుపళ్లు, రాగి నాణాలు, చెరుకు ముక్కలు, నువ్వులు, పిండి వంటలు కలిపి తలపై నుంచి జారే విధంగా భోగి పళ్లు పోస్తారు. అనంతరం ముత్తైదువులకు వాయినాలతో పాటు సాయంత్రం బొమ్మల కొలువును ఏర్పాటు చేసి అందరినీ ఆహ్వానిస్తారు. గోదాదేవి శ్రీకృష్ణుడిని ఆరాధించి రంగనాథుడిని పరిణయమాడి భోగమనుభవించిన రోజు కనుకనే భోగి పండుగ అనే ఇతిహాసం కూడా ఉంది.

● పుణ్యప్రద సంక్రమణం.. సంక్రాంతి

సంక్రాంతి లక్ష్మీ ఆగమనానికి సంకేతం. శ్రీమన్నారాయణుడితో కలిసి లక్ష్మీదేవి రంగురంగుల ముగ్గుల రథానెక్కి వస్తుందంటారు. ఈ రోజు ముగ్గులకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. లక్ష్మితోపాటు సంక్రాంతి పురుషుడు, బలి చక్రవర్తి ఇంటికి వచ్చి శుభాలనిస్తారని ప్రతి ఇంటిని ఆవు పేడతో శుభ్రంగా అలికి ముగ్గులు పెట్టి గొబ్బెమ్మలను తయారు చేసి కూరపిండి ఆకు, రేగుపళ్లు, నువ్వులు పెట్టి ముగ్గులో ఉంచుతారు. చిన్నా పెద్దా తేడా లేకుండా గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడతారు. రాక్షసుల బాధ భరించలేని లక్ష్మీదేవి గోమయంలో దాగి ఉండగా ఆ రూపమే గొబ్బెమ్మ అని చెబుతూ పూజించే సాంప్రదాయం ఉంది. స్వేచ్ఛా మరణ వరం పొందిన భీష్ముడు అంపశయ్యపై పడుకుని ఉత్తరాయణ పుణ్యకాలందాకా వేచి ఉండి మరణించడంతో అందరూ నూతన వస్త్రాలు ధరించి పెద్దలకు నమస్కరించి తమ పితృ దేవతలకు ఉత్తమ లోకాలు ప్రాప్తించాలని దానాలు చేస్తారు. సౌభాగ్యాలు కలగాలని పిండి వంటలు చేసి పితృ దేవతలకు, నివేదన చేసి తాము భుజిస్తారు. హరిదాసులు, గంగిరెద్దుల వారు, బసవన్నలు, జంగమ దేవరలు, బుడబుక్కల వారికి ధాన్యాదులు దానంచేస్తారు. మహిళలు, యువతులు నోములు పంచుకొని వాయినాలు ఇచ్చుకొని ముత్తైదువుల ఆశీస్సులు పొందుతారు.

● రైతుల పండుగ కనుమ ..

సంక్రాంతి మరుసటి రోజు కనుమ పూర్తిగా రైతులకు సంబంధించిన పండుగ. సంవత్సరమంతా తమతో కష్టపడిన పశువులను పూజించడంలో భాగంగా ఎద్దుల కొమ్ములకు రంగులు వేసి ముస్తాబు చే స్తారు. గిట్టలను కడిగి పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. పశువుల శాలలను పేడతో అలిగి ముగ్గులు పెట్టి పొంగలి వండి పాలు పొంగిస్తారు. మినపగారెలు నైవేద్యంగా పశువులకు పెట్టి తాముా తింటారు. సాయంత్రం పశువులను సంరక్షించమని గ్రామ, పొలిమేర దేవతలకు బలి సమర్పిస్తారు. కోడి, ఎద్దుల పందాలు, క్రీడలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడుపుతారు.

● పూలు, పండ్లు, గొబ్బెమ్మలు



బంతి, చేమంతి, మల్లె వంటి పూలు 35 రూపాయలకు పావుకిలో, 50 రూపాయలకు అరకిలో చొప్పున అమ్ముతున్నారు. రైతులు, మహిళలు గొబ్బెమ్మల సామాగ్రి, మామిడాకు, గుమ్మడికాయలు, రేగుపండ్లు, గరిక, నవధాన్యాలు, పేడ తెచ్చి అమ్ముతున్నారు. ఒక్కో వస్తువు 10 రూపాయల నుంచి 120 రూపాయల వరకు అమ్ముతున్నారు. పండ్లు వెరైటీని బట్టి 15 రూపాయల నుంచి 120 రూపాయల వరకు దొరకుతున్నాయి. రేగు పండ్లకు గిరాకీ పెరిగింది. అర కిలోకు 30 నుంచి 50 వరకు అమ్ముతున్నారు.

● నోములు..

నోవములకు గిరాకీ బాగా పెరిగింది. మార్కెట్‌లో 10 రూపాయల నుంచి 3 వేల వరకు నోము వస్తువులు దొరకుతున్నాయి. చిన్నగిన్నెలు, స్టీల్ సామగ్రి, పూజా సామాగ్రి, ప్లాస్టిక్ వస్తువులు, దేవతావిగ్రహాలు, మొంటెల వాయినాలు, తామర గింజలు లభ్యమవుతున్నాయి.

● చిలకలు, బత్తీసలు...

పిల్లలకు భోగి పండ్లతో పాటు చిలకలు, బత్తీసల దండలు వేయడం ఆచారంగా వస్తుంది. మహిళలు నోములలో వాటిని ఉంచి వాయినాలు ఇవ్వడం పరిపాటి. దీంతో చిలకలకు, బత్తీసలకు గిరాకీ పెరిగింది. 40 రూపాయలకు పావు కిలో చొప్పున అమ్ముతున్నారు.

● మార్కెట్‌లో సందడి

సంక్రాంతి పండుగకు కావాల్సిన ముగ్గులు, నోములు, పూలు, పండ్లు, వస్త్రాల కొనుగోళ్లు మార్కెట్‌లో జోరుగా సాగుతున్నాయి. నాలుగైదు రోజులుగా కొనుగోళ్లతో మార్కెట్ కిటకిటలాడుతోంది. ఏ షాపు చూసినా జనంతో నిండుగా కనిపిస్తోంది. ప్రతి రోజూ రాత్రి వరకు విక్రయాలు జరుగుతుండగా పండగకు కావాల్సిన వస్తువులకు గిరాకీ ఉంటోంది.

టవర్‌సర్కిల్, పొట్టి శ్రీరాములుచౌక్, మార్కెట్‌రోడ్ ప్రాంతంతో పాటు రోడ్లపై ముగ్గుల రంగుల షాపులు వెలిశాయి. మెరుపుల కలర్‌లు పావుకిలో ప్యాకెట్ 20 నుంచి 30 రూపాయల వరకు పలుకుతుండగా మామూలు రంగులు 50 గ్రాములకు 20 రూపాయలు పలుకుతున్నాయి. ముగ్గుల సాంచెలు, గిరకలు 10 నుంచి 25 రూపాయల వరకు వివిధ డిజైన్లతో లభ్యమవుతున్నాయి.



కరీంనగర్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

వైభవంగా గోదారంగనాథ కల్యాణం



సప్తగిరికాలనీ కోదండరామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 13: నగరంలోని పలు ఆలయాల్లో గోదారంగనాథ కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని కల్యాణాలను తిలకించారు. వావిలాలపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలో వేదభవనం ప్రిన్సిపల్ డాక్టర్ కె వరప్రసాదాచార్యులు, అర్చకులు సత్యనారాయణాచార్యులు, చరణ్ ఆధ్వర్యంలో కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ చైర్మన్ మేచినేని అశోక్‌రావు-స్థానిక కార్పొరేటర్ మేచినేని వనజ, భక్తులు పాల్గొన్నారు. సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో అర్చకుడు కె రామాచార్యులు బృందం కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె గౌతమరావు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. జెడ్‌పి క్వార్టర్స్ వేంకటేశ్వరాలయంలో మేయర్ సునీల్ రావు-అపర్ణ దంపతులు కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ కొస్న కాంతారెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర మండలం మధురానగర్ శ్రీకోదండ సీతారామస్వామి దేవాలయంలో శనివారం జరిగిన శ్రీగోదారంగ నాయకుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.అమ్మవారికి అభిషేకం, కుంకుమ అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై ఆసీనులను చేసి ఘనంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. గంగాధర మండలం మధురానగర్‌లో జరిగిన శ్రీగోదారంగనాథ కల్యాణంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

హుజూరాబాద్ : హుజూరాబాద్ పట్టణంలోని శ్రీసీతా రామచంద్రస్వామి ఆలయంలో గోదారంగనాథస్వామి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు మాధవచార్యులు, నిఖిల్‌ఆచార్యులు, రామన్న, శ్రీధరాచార్యులు గోదారంగనాథస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా వేదపండితులు స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మ నగర్ గ్రామంలో గల తాపాల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం శ్రీ గోదా రంగనాథ స్వామి వారి తిరు కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి వెంకటాద్రి స్వామి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి కేతిరెడ్డి ఎల్లారెడ్డి, ఎంపిపి కేతిరెడ్డి వనిత దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ జక్కని శ్రీవాణి, ఆలయ పాలకవర్గం పాల్గొన్నారు.



జెడ్‌పి క్వార్టర్స్ వేంకటేశ్వరాలయంలో కల్యాణంలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు దంపతులు



గంగాధరలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

● ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 13: తెలుగు రాష్ట్రాల ప్రజలకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల్లోని హిందూ బంధువులం దరికీ మకరసంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండుగ భోగ భాగ్యాలను అందించాలని ఆకాంక్షించారు. భారతీయుల ఐదు దశాబ్దాల నిరీక్షణ అయోధ్య రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల22న ఉంటుం దన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ నెల 22న ప్రతి ఒక్కరూ దగ్గరలోని ఆలయానికి వెళ్లి భగవంతున్ని దర్శించుకోవాలన్నారు. సాయంత్రం ప్రతి ఇంటా ఐదు దీపా లు వెలిగించి వెలుగులు నింపాలన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తి

ఇల్లందకుంట, జనవరి 13: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల డేటా ఎంట్రీ పూర్తి చేసినట్లు ఇల్లందకుంట ఎంపీడీవో తీగల శంకర్ శనివారం తెలిపారు. మండలంలోని 18గ్రామపంచా యతీల్లో స్వీకరించిన రైతభరోసా, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల కింద 10,849 దర ఖాస్తులు రాగా వాటిని కంప్యూటరీకరణ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సీఐటీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

భగత్‌నగర్, జనవరి 13: కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని, ఈ నెల 19న జరిగే సిఐటియు, రైతువ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సును సయప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం నగరంలోని కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై ఇంటింటికీ అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా సదస్సును కార్మిక, కర్షకులు విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభు త్వం పది సంవత్సరాల కాలంలో కార్పొరేట్ కంపెనీలకు మాత్రమేపనిచేసిందన్నారు. సంపదను సృష్టిస్తున్న కార్మిక, కర్షకులకు తీవ్రమైన మోసపూరిత చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఈ నెల 19వ తేదీన కార్మిక కర్షక మైత్రి దినోత్సవం సందర్భంగా జిల్లా సదస్సు నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు నిరం తర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, ప్రధాన కార్య దర్శి ఎడ్ల రమేష్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసుదేవరెడ్డి, వ్యవ సాయ కార్మికసంఘంజిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై
మేయర్ వ్యాఖ్యలు అర్థరహితం

● మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్ టౌన్, జనవరి 13: కరీంనగర్-తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణం చేస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిపై మేయర్ సునీల్‌రావు చేసిన వాఖ్యలు అర్థరహితమని, ఆయన చేసిన వాఖ్యలను బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్ అన్నారు. శనివారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాలతో ఆర్వోబీ నిర్మాణం చేపట్ట డంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకో లేదని, దీనితో నిత్యం వాహనదారులు, ప్రజలు, ఆస్పత్రులకు వచ్చే వారు చాలా ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ నామ్‌కే వాస్తే ఆర్‌వోబీ నిర్మాణం విషయంలో మాయమాటలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రైల్వే అధికారులు, రైల్వేశాఖ మంత్రి, కేంద్ర ప్రభుత్వానికి సమస్యను వివరించి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను ప్రారంభించడానికి కృషిచేశారని రమేశ్ తెలిపారు. ఆర్వోబీ నిర్మాణ పనులు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం సేతు బంధు పథకం ద్వారా రూ.155 కోట్లతో చేపడుతున్నారని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణంలో గత కేసీఆర్ ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ చేసిందేమిటో మేయర్ సునీల్‌రావు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్వోబీ నిధుల విషయంలో అవగాహన లేకుండా ఎంపీ సంజయ్‌పై ఆరోపణలు చేయడం మేయర్ అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సొమ్ము కేంద్రానిదైతే, బీఆర్ఎస్ నాయకులు, మేయర్‌లాంటి వ్యక్తులు ఏదో ఘనకార్యం చేసినట్లు ప్రచారం చేసుకోవడానికి సిగ్గుపడాలని అన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని మేయర్‌కు సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్ళపు రమేశ్

బావిలో పడి ఒకరి మృతి

బోయినపల్లి, జనవరి 13: మండల కేంద్రంలో శనివారం పుల్లూరి అంజనేయులు (45) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన అంజనేయులు సిరిసిల్లలో మరమగ్గాల కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 11 గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన అంజనేయులు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. అంజనేయులు భార్య లలిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు.

బావిలోకి దూసుకెళ్లిన కారు : ఒకరు మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 13: పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి గ్రామ శివారులో శనివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు కారు బావిలో పడి ఒకరు మృతిచెందగా, ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిమ్మనపల్లి గ్రామం నుంచి పెద్దకల్వలకు వెళ్తున్న కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిందన్నారు. ఈ ప్రమాదంలో రంగంపల్లికి చెందిన వినిత్‌రెడ్డి(27) మృతి చెందగా, కారులో ఉన్న గాదె అఖిల్, అల్లం బాల అనురోహిత్‌రెడ్డి, సాయిలు బావి పైప్ ద్వారా బయటికి వచ్చి క్షేమంగా బయటపడినట్లు తెలిపారు. పెద్దపల్లి ఎస్ఐ 2 మల్లేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుజరాత్‌వాసి మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండల శివారులోని ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుజరాత్‌కు చెందిన కులదీప్ కుమార్(28) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన కులదీప్‌కుమార్ ఓ బీడీ కంపెనీలో పనులు చేస్తుండేవాడన్నారు. ఈ నెల 10న గంభీరావుపేటకు చెందిన కిషోర్‌తో కులదీప్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గంభీరావుపేట నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తుండగా గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టిందన్నారు. దీంతో కులదీప్‌కుమార్, కిషోర్ తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. కులదీప్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో మొదట సిరిసిల్లకు తరలించారని, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారన్నారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ కులదీప్‌కుమార్ శనివారం మృతి చెందాడన్నారు.

వెంకటయ్యపల్లిలో..

గంగాధర: గంగాధర మండలం వెంకటయ్యపల్లికి చెందిన రావుల లచ్చగౌడ్(58) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. లచ్చగౌడ్ గతేడాది డిసెంబరు 26న ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు వెళ్లి గ్రామానికి తిరిగి వస్తుండగా కురిక్యాల శివారులో నిలిపివేసిన లారీని వెనక నుంచి ఢీకొట్టాడన్నారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడన్నారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు.

మద్యం మానుకోవాలన్నందుకు ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో మద్యం మానుకోవాలని మందలించినందుకు రంగు దేవయ్య(49) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణాకు చెందిన దేవయ్య నాలుగేళ్ల కిందట భార్య పిల్లలతో కలిసి ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు వలస వచ్చాడు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని జీవిస్తున్నాడు. స్థానికంగా మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుండేవాడు. పంట దిగుబడి తగ్గడంతోపాటు కుటుంబ పోషణకు సుమారు రూ.2 లక్షలు అప్పు చేశాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. తరుచూ ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటుండేవి. మూడు రోజుల కిందట గొడవ జరగగా, ఇంటి ఎదురుగా ఉన్న నారాయణ మందలించడంతో ఆయనపై దాడికి దిగాడు. రోజూ తాగొచ్చి గొడవపడుతున్నావంటూ తాగుడు మానుకోవాలంటూ భార్య బాలవ్వ దేవయ్య మధ్య శుక్రవారం రాత్రి వాగ్వాదం చోటుచేకుంది. శనివారం ఉదయం లేచి చూసే సరికి దేవయ్య ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దకల్వలలో..

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వలకు చెందిన నర్ల పోచాలు (58) మద్యానికి బానిసై మానసిక వేదనతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ2 మల్లేష్ తెలిపారు.

భవనం పైనుంచి పడి మధ్యప్రదేశ్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి13: భవన నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో పైనుంచి పడి మధ్యప్రదేశ్ రాష్ట్రం బాల్‌గాటు జిల్లాకు చెందిన లకనో కోహెర్ (34)మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన లకనో కోహెర్ కుటుంబం ఏడాది కిందట కరీంనగర్‌కు వచ్చి కొత్తపల్లిలోని ఒక భవన నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నారన్నారు. శనివారం భవనంలోని నాలుగో అంతస్థులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయని, ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

» అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

» ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త

» అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం



సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రియా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చెలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

» ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు

» అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో

» 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

» అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం

» రైలు పట్టాలపై పడిన గాలి పటం

» నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.



కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జనవరి 13: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

సిర్పూర్ ఎమ్మెల్యే పూజలు



అంజన్న సన్నిధిలో ఎమ్మెల్యే హరీష్‌బాబు

సిర్పూర్-కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శనివారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు సత్కరించారు. అలాగే ఖమ్మం అడిషనల్ న్యాయమూర్తి గుర్రం శ్రీనివాస్ కూడా అంజన్నను దర్శించుకున్నారు

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి

జగిత్యాల అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ ఎస్పీ

కొడిమ్యాల, జనవరి 13: క్రీడలు క్రీడాకారుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఆర్ ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని నమిలికొండ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వాలీబాల్ సీనియర్ క్రీడాకారుల స్మారకార్థం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నమిలికొండ పోలీస్ బృందం వారు నిర్వహిస్తున్న వాలీబాల్ ఆటల పోటీలను అడిషనల్ ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రతీ వ్యక్తిలో మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. నమిలికొండ గ్రామం నుంచి పలువురు పోలీస్ ఉద్యోగాలు చేస్తు సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల స్మారకార్థం ఆటల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీం రావు(ఏఆర్), జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, సీఎస్ఎస్ సీఐ వేంకటేశ్వర్‌రావు, కొడిమ్యాల ఎస్సై కె వెంకట్‌రావు, జడ్పీటీసీ ప్రశాంతి, ఎంఈవో శ్రీనివాస్, సర్పంచు అనితనరేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నాయకులు జి. లక్ష్మణ్, ఎం క్రిష్ణారెడ్డి, సీహెచ్ సుధీర్‌రావు, రాంచందర్‌రావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రఘుపతిరెడ్డి, ఫుడ్ స్పాన్సర్లు లక్ష్మీరాజం, ఇ.శ్రీనివాస్, స్పోర్ట్స్ కిట్ స్పాన్సర్ ఎన్. శ్రీనివాస్, షాబొద్దీన్, టోర్నమెంట్ నిర్వహిస్తున్న నమిలికొండ పోలీస్ బృందం పాల్గొన్నారు. ఈ క్రీడల్లో 42 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రాజన్న ఆలయ పరిసరాల్లో

భక్తిభావాన్ని పెంపొందించాలి..

● భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

● త్వరలో సీఎంతో సమీక్షకు కసరత్తు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నరసింహుడి ధ్వజ స్తంభం వద్ద మొక్కుతున్న దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్

వేములవాడ టౌన్, జనవరి 13 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో భక్తిభావం పెంపొందేలా చూడాలని, ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులకు సూచించారు. వేములవాడ ఆలయంలోని చైర్మన్ చాంబర్‌లో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రాజన్న ఆలయానికి వచ్చేది పేద, మధ్యతరగతి భక్తులేనని, వారికి కావాల్సిన వసతి సౌకర్యాలను మెరుగు పర్చాలని అన్నారు. దర్శనం సులువుగా అయ్యేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రోటోకాల్ బ్రేక్ దర్శనాలకు కొత్త నివేదిక తయారు చేయాలన్నారు. వసతి గదుల్లోనూ భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. సామాన్య భక్తులు విడిది చేసేందుకు మాస్టర్ ప్లాన్‌కు ఆటంకం కలుగకుండా షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కరీంనగర్‌లోని కల్యాణ మండపం ప్రస్తుతం ప్రాధన్యం లేనందున దాని స్థానంలో ఆదాయాన్ని పెంపొందించే విధంగా కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. రాజన్న ఆలయానికి సంబంధించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి ఆదాయాన్ని పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా సమ్మక్క, సారలమ్మ జాతరతోపాటు మహాశివరాత్రి జాతరకు భక్తులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేష్, ఏఈవోలు జయకుమారి, ప్రతాప నవీన్, హరికిషన్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, డీఈ రఘునందన్ ఉన్నారు.

నరసింహుడి సన్నిధిలో దేవాదాయశాఖ కమిషనర్ పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ వి అనిల్‌కుమార్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. వేద పండితులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి దర్శనం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. అనుబంధ ఆలయాలు, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. ఆయన వెంట ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇనుగంటి రమా వేంకటేశ్వర్‌రావు, అక్కెనపెల్లి సురేందర్, అర్చకులు నంబి నరసింహమూర్తి, అశ్విన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో ..

మల్యాల: రాష్ట్ర దేవాదాయ కమిషనర్ వి అనిల్‌కుమార్ శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకు న్నారు. కుటుంబ సమేతంగా ఆలయంకు వచ్చిన కమిష నర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో వెంకటేష్ సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్ ఆలయ అధికా రులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పాలక మండలి సమావేశాలు నిర్వహించకపోవడం, అధికారుల బదిలీపై డైరెక్టర్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

నరసింహుని ఆలయంలో పెరిగిన రద్దీ

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం కూడా తోడు కావటంతో అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో, రావి చెట్టు ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ భక్తులు ప్రదక్షిణాలు చేశారు. స్వామి వారలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామి వారలను అందంగా పూలతో అలంకరణ చేశారు.

అంతకు ముందు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్యా, నరసింహమూర్తి, అర్చకులు వంశీకృష్ణ, విజయ్, మోహన్, కిరణ్, సంతోష్, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక దందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు





మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో, గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో ఇసుక డంపులను పరిశీలిస్తున్న పోలీసులు

గన్నేరువరం, జనవరి 13, అక్రమంగా ఇసుక దందాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి హెచ్చరించారు. శనివారం మండలంలోని గుండ్లపల్లి శివారులో ఇసుక డంపులపై ఎస్‌ఐ చందా నరసింహారావుతో కలిసి దాడులు నిర్వహించారు. సుమారు 17 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుండ్లపల్లి శివారులో పలుచోట్ల అక్రమంగా ఇసుక డంపులను పోసి రాత్రి వేళలో సిద్దిపేట, హైదరాబాద్‌కు తరలిస్తున్నారని స్థానికులు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు.

మెట్‌పల్లి రూరల్: అక్రమంగా ఇసుకను నిల్వ చేసినా, తరలించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో ఎలాంటి అనుమంతులు లేకుండా అక్రమంగా ఇసుకను నిల్వ చేసినట్లు సమచారం అందగా ఆర్‌ఐ ఉమేశ్‌తో కలిసి దాడులు నిర్వహించి డంపులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన డంపుల్లో ఇసుక సుమారు 10 ట్రాక్టర్ల కంటే ఎక్కువ ఉండవొచ్చని అంచనా వేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మొరం తరలించినా, నిల్వచేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరద కాలువకు నీటి విడుదల



ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద కాలువకు మూడు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఎస్సారెస్పీ అధికారులు ప్రకటించారు. చేపలు పట్టేవారు, పశువుల కాపర్లు, రైతులు, సాధారణ ప్రజలు వరద కాలువ వద్ద అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇదిలాఉండగా ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 63.185 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 72.908 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి 8,149 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కు లు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూ సెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు జానకి ఎంపిక


జానకికి మెమొంటోను అందిస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 13: జిల్లా కేంద్రంలోని లారా జూడో అకాడమికి చెందిన క్రీడాకారిణి బి.జానకి జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైంది. అండర్-19 బాలికల విభాగంలో ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరుగనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ జూడో పోటీల్లో ఆమె తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని లారా జూడో అకాడమి కోచ్ మాకు శ్రీధర్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జానకికి ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పోతన శ్రీనివాస్ మెమొంటోను, పతకాన్ని ప్రదానం చేసి అభినందించారు. జూడో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కగారి అనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దనరెడ్డి, సభ్యులు ఎల్‌వి రమణ, సత్యనారాయణ తదితరులు అభినందించారు.

లయన్ కెప్టెన్ మధుసూదన్‌రెడ్డికి అవార్డు


అవార్డును అందుకుంటున్న బుర్ర మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జనవరి 13: అంతర్జాతీయ లయన్స్‌లో 20 ఏళ్లుగా సేవలను అందిస్తున్న కరీంనగర్‌కు చెందిన శాతవాహన లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యుడు లయన్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డికి అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ అరుదైన మైల్ స్టోన్ చెవరాన్ అవార్డును అందించింది. బుర్ర మధుసూధన్‌రెడ్డికి అంతర్జాతీయ లయన్స్ సంస్థ అధ్యక్షురాలు లయన్ డాక్టర్ పట్టి హిల్ అవార్డుకు ఎంపిక చేసి పంపించిన మైల్ స్టోన్ చెవరాన్ అవార్డును శనివారం జిల్లా గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రసాయనశాస్త్ర సహ ఆచార్యులుగా, ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఎన్‌సీసీ కంపెనీ కమాండర్‌గా, లయన్స్ జిల్లా అదనపు కార్యదర్శిగా, కలెక్టరేట్ శిక్షణా కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగుల ట్రెయినర్‌గా, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం అధ్యక్షుడిగా, వ్యక్తిత్వ వికాస నిపుణులుగా వివిధ రంగాల్లో నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న మధుసూదన్‌రెడ్డికి అవార్డు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కెబినెట్ సెక్రెటరీ లయన్ ఎంవి రమణారెడ్డి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు లయన్ వై.శేఖర్‌రావు, ఎం.మహేందర్, కె.సత్యం, కె.రాజేందర్‌రెడ్డి, ఎన్.ప్రసాదరావు, నర్సింగరావు, ఇనుగుర్తి రమేశ్, జి.లక్ష్మయ్య, సంపత్‌కుమారి, వి.జగదీశ్వరాచారి, జె.సి.ప్రకాశ్, ఎం.సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

17న సమ్మక్క-సారలమ్మ జాతర వేలం

శంకరపట్నం, జనవరి 13: శంకరపట్నం మండలం కేశవపట్నంలో ఫిబ్రవరి 21నుంచి 24వరకు నిర్వహించే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరలో విక్రయాలకు ఈ నెల 17న వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో మారుతిరావు శనివారం తెలిపారు. వేలంలో పాల్గొనుటకు ఆసక్తి గల వారు ఈ నెల 16,17వ తేదీల్లో ఉద యం 11గంటలకు రూ.100 చెల్లించి వేలం పాట ఫారం పొందవచ్చని పేర్కొన్నారు. వేలం ద్వారా టెంకాయలు, బెల్లం, తలనీలాలు, పుట్నాలు, పేలాలు విక్ర యించుకునే హక్కులు కల్పించబడునని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, అధికారులు

సైదాపూర్, జనవరి 13: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం సైదాపూర్ మం డలంలోని దుద్దెనపల్లి గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌ఈడీ స్ర్కీన్ ద్వారా పథకాల అమలు విధానం తెలిపారు. కార్య క్రమంలో సర్పంచ్ తాటిపెల్లి యుగేందర్‌రెడ్డి, ఎంపీటీసీ చాడ చైతన్య-కొం డాల్ రెడ్డి, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, ఎంపీవో సురేందర్, ఏఈవో రజనీకాంత్, మెడికల్ సూపర్‌వైజర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట : మండలంలోని గడ్డివానిపల్లె, టేకుర్తి గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి దేవేందర్ రెడ్డి, బ్యాంక్ సిబ్బంది సాయిబాబా, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ఏఈవో తిరుపతి, మెడికలాఫీసర్ కల్యాణ్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సదాశివపల్లి వద్ద జంక్షన్ ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


సదాశివపల్లి వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, జనవరి 13: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లి బస్టాండ్ చౌరస్తా వద్ద జంక్షన్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను శనివారం ఆదేశించారు. సదాశివపల్లి లోని తీగల వంతెనపై వెళ్లే రహదారి చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జంక్షన్ ఏర్పాటు కోసం త్వరిత గతిన పనులను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అధికారులు ఉన్నారు.

మొక్కు చెల్లించుకున్న యువసేన సభ్యులు

కొడిమ్యాల, జనవరి 13: మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన కమలాకరన్న యువసేన సభ్యులు పూండ్ర మధు, బైరి సంజీవ్ చొప్పదండి ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం గెలిచిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదిలో తల నీలాలు తీసుకొని అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత గుండ్లు తీయించుకుంటామని ఆంజనేయస్వామికి మొక్కుకున్నట్లు గ్రామస్థు లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచు సురకంటి ముత్యంరెడ్డి, గ్రామస్తులు రాజయ్య, మహేష్, శేఖర్, శ్రీనివాస్, శ్రీకర్, తిరుపతి తదితరులు ఉన్నారు.

●మల్యాల: ఎమ్మెల్యేగా మేడిపల్లి సత్యం విజయం కాంక్షిస్తూ మొక్కులు పెట్టుకున్న రామన్నపేటకు చెందిన క్యాతం నర్సింహరెడ్డి శనివారం రేణుక ఎల్లమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించాడు. సత్యం ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో 101 కొబ్బరికాయలు కొట్టాడు. వెల్మ లక్ష్మారెడ్డి, ఆదిరెడ్డి, ఎర్రన్న, వలీ, మారంపల్లి గంగాధర్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, ఆర్మీ శ్రీనివాస్, నేరెళ్ల నర్సింహరెడ్డి, కిషన్‌రెడ్డి, నక్క అనిల్, ముద్దం శ్రీనివాస్, మర్రి లక్ష్మన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు


విజేతకు బహుమతి అందజేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్, జనవరి 13: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే మైదానంలో శనివారం ధరణి ఫౌండేషన్, ఎన్‌కె అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ సునీల్‌రావు ప్రథమ బహుమతి విజేత కొండ్ర వరలక్ష్మికి (వన్నారం) 50 వేల నగదు, ద్వితీయ బహుమతి విజేత శ్రీపెల్లి ఇందుకు (పెద్దపల్లి) 25 వేల నగదు, తృతీయ బహుమతి విజేతకు పొలాస రాణికి (కరీంనగర్) 12 వేల నగదు బహుమతి అందజేశారు. అదేవిధంగా 10 కన్సోలేషన్ బహుమతులను 1000రూపాయల చొప్పున అందజేశారు. పార్టిసిపేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు దేవులపల్లి రేణుక తదితరులు పాల్గొన్నారు.

●స్థానిక రామచంద్రాపూర్ అంజనాద్రి కాలనీలో శనివారం కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మేయర్ సునీల్‌రావు, 34వ, 13వ డివిజన్ కార్పొరేటర్లు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, సుద్దాల రాముగౌడ్ పాల్గొన్నారు.

●**సుభాష్‌నగర్, జనవరి 13:** వాసవీక్లబ్, ఎంఆర్ అభ్యుదయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. శనివారం స్థానిక మంకమ్మ తోటలో గల ఎంఆర్ వైశ్యభవన్ ఎదుట ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి ఎల్లంకి రజిత, ద్వితీయ బహుమతి కోల స్వరూప అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాత శేఖర్, జిల్లా అంజయ్య, బొడ్ల సంతోష్, జిల్లా వేణుగోపాల్, ఎల్లంకి ప్రదీప్, వినాయక జ్యువెల్లర్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రమాదం
-ప్రయాణికుడికి తీవ్ర గాయాలు

కరీంనగర్ క్రైం, జనవరి 13: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం జరిగిన ప్రమాదంలో ప్రయాణికుడు శంక రపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన కాసు బుచ్చయ్య(58)కు రెండు కాళ్లు విరిగాయి. ప్రయాణికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం బుచ్చయ్య కరీంనగర్ నుంచి కొత్తగట్టు వెళ్లేందుకు హన్మకొండ బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ పడిపోయాడు. ఆర్టీసీ డ్రైవర్ చూసుకోకుండా నడపడంతో బుచ్చయ్య కాళ్లపై నుంచి ముందు టైర్ వెళ్లి ఎడమ కాలు పాదం నుజ్జునుజ్జు కాగా కుడి కాలు విరిగిపోయింది. 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధి తుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, జనవరి 13: తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (టిఎస్‌టియు) రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను డాక్టర్ బంగారుస్వామి ఆవిష్కరించారు. శని వారం నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి, అసోసియేట్ అధ్య క్షులు కాలువ లక్ష్మన్, బండ నర్సింహారెడ్డి, పాలోజి రవీంద్రా చారి, ఉపాధ్యక్షులు రెడ్డి సీతారాంరెడ్డి, బొడ్డు కృష్ణ, అన్నాడి లక్ష్మారెడ్డి, హనుమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉమ్మా రెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయకులు ఎలమ దాసరి రవి, మిరాజుద్దీన్, కాంతయ్య, సురేందర్‌రెడ్డి, నాగభూషణం, యూసుఫ్‌దీన్, సత్యనారాయణ, శ్రీనివాస్, నరేశ్, కృష్ణారెడ్డి, అరవింద్‌బాబు, ప్రఫుల్ పాల్గొన్నారు.

'అవినీతికి అడ్డాగా మున్సిపల్ కార్పొరేషన్'

కరీంనగర్ టౌన్, జనవరి 13: కరీంనగర్ కార్పొరేషన్ అవినీతికి అడ్డాగా మారిందని బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ అన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థలో అధికారులు, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై కోట్లు దండుకుంటున్నారన్నారు. వాడకంలో లేని వాహనాలకు సైతం బిల్లులు దండుకుంటున్నారన్నారు. డీజిల్ వాడకం పేరిట భారీ కుంభకోణం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నగర పాలక సంస్థ అవినీతి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇండియా కూటమి చైర్మన్‌గా మల్లికార్జున ఖర్గే ఎంపికపై హర్షం

కరీంనగర్ అర్బన్, జనవరి 13: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఇండియా కూటమి జాతీయ చైర్మన్‌గా ఎంపిక చేయడం పట్ల టీపీసీసీ కన్వీనర్ వెన్న రాజమల్లయ్య శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం వైఖరితో దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమా దంలో పడిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ, జాతీయ బ్యాంక్‌లను లూటీ చేసిన వారికి బీజేపీ ప్రభుత్వం రక్షణ కల్పిస్తున్నదని విమర్శించారు. ఉపాధిహామీ పథకానికి తూట్లు పొడుస్తున్నదని దుయ్యబట్టారు.

నెట్ బాల్ పోటీల్లో నగునూరు విద్యార్థికి రజతం


విద్యార్థి సిద్ధార్థను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 13: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తలేదీ వరకు జరిగిన అండర్-14 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటల్లో జెడ్‌పీహెచ్‌ఎస్ నగునూరు పాఠశాల విద్యార్థి ఈ సిద్ధార్థ పాల్గొని రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా సిద్ధార్థను యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అతడిని ప్రత్యేకంగా అభినందించారు. ముున్ముందు మరింత ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్ జనార్దనరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పోతన శ్రీనివాస్, డీవైఎస్‌ఓ కీర్తి రాజవీరు తదితరులు పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం
-మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


ఎమ్మెల్యే కవ్వంపల్లికి వినతిపత్రం ఇస్తున్న సమద్‌నవాబ్

కరీంనగర్ అర్బన్, జనవరి 13: నగరంలోని బైపాస్ రోడ్ ఖబ్రస్థాన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సరిపడా నిధులను మంజూరు చేయించి ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారా యణ అన్నారు. శనివారం బైపాస్ రోడ్‌లోని ఖబ్రస్థాన్‌ను క్షేత్ర స్థాయిలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ, కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురుమళ్ళ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్ ఖబ్రస్థాన్ కమిటీ, మస్జిద్ అఫ్జల్ బీయాబానీ కమిటీ కార్యదర్శి సమద్ నవాబ్ ఖబ్రస్థాన్ కాంపౌండ్‌వాల్ నిర్మాణం, గ్రావెల్, అంతర్గత రోడ్లు, గ్రీనరీ ఏర్పాటు, మోడల్ ఖబ్రస్థాన్‌గా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కవ్వంపల్లికి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో ముఖరం, గఫ్ఫార్, ఇర్ఫాన్, షాహిద్ ఆఫ్రిది, అహద్, నవిద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ


జమ్మికుంటలో అక్షింతలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు


సైదాపూర్‌లో తలంబ్రాలు పంపిణీ చేస్తున్న భక్తులు

జమ్మికుంట, జనవరి 13: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 25,27,29 వార్డుల్లో బీజేపీ నాయకులు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, ఠాగూర్ రాజేష్, ఠాగూర్ రాకేష్, మోడం రాజు, బూరుగుపల్లి రామ్, సదానందం, విజయ్, తిరుపతయ్య, చిరంజీవి, కిరణ్, రాకేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలో శనివారం శ్రీరామ భక్తులు ఇంటింటికీ అయోధ్య రాముని తలంబ్రాలు పంపిణీ చేశారు. తలంబ్రాల పంపిణీకి మహిళలు మంగళహారతులతో నీరాజనం పలికారు. భక్తి శ్రద్ధలతో తలంబ్రాలు సేకరించారు. రామ మందిర ప్రతిష్ఠాపన సందర్భంగా ఈ నెల 22న సాయంత్రం ఇంటి ముందు దీపాలు వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు మునిగంటి సంతోష్, నెల్లి శ్రీనివాస్, కూతురు విద్యాన్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వంతెన


శిథిలావస్థకు చేరిన వంతెన

చొప్పదండి, జనవరి 13: చొప్పదండి పట్టణ శివారులోని కాల్వ వంతెన శిథిలావస్థకు చేరింది. డి-86 కాలువ నిర్మాణ సమయంలో దాదాపు 45 ఏళ్ల క్రితం వంతెన నిర్మించారు. పట్టణ పరిధిలోని తొగురుమామిడి కుంటకు వెళ్లే దారి ఇది ఇక్కటే కాగా ప్రతి నిత్యం ప్రజలు ఇదే వంతెనపై నుంచి రాకపోకలు కొనసాగిస్తుంటారు. తొగురుమామిడి కుంటలో నాలుగు రైస్ మిల్లులు ఉండగా పదుల సంఖ్యలో భారీ వాహనాలు వెళ్తుంటాయి. వంతెన పాడైపోగా ప్రమాదం అంచున ప్రయాణాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని ఒకటవ వార్డు పరిధిలోకి వచ్చే తొగురుమామిడికుంట ప్రజలు ప్రతి పనికి ఈ వంతెనపై నుంచి రావాల్సి ఉండగా పదేళ్లుగా కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పల్లెప్రకృతి వనం

తిమ్మాపూర్, జనవరి13: మండలంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. జిల్లా రవాణాశాఖ వెనుకాల, డ్యాం సమీపంలో శివారు ప్రాంతంలో ఉండటంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. రాజీవ్ రహదారికి సమీపంలో ఉండటంతో రాత్రి, పగలు లేకుండా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. కంచె తీసివేయడంతో, పాటు గేట్లు తెరిచే ఉంటోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు కనిపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తిమ్మాపూర్‌లోని పల్లె ప్రకృతి వనం


మద్యం బాటిళ్లు

కన్నుల పండువగా కల్యాణం


కల్యాణానికి అక్షింతలు తీసుకువెళ్తున్న గ్రామస్థులు

జమ్మికుంట రూరల్, జనవరి 13: జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో గల శివాలయంలో శనివారం గోదాదేవి రంగనాయకుల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామస్థులు కల్యాణ మహోత్సవానికి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుల్లూరి సదానందం, ఉప సర్పంచ్ కంకణాల రాణి, గ్రామస్థులు నూకల రాజేశం, వీరగోని రాజయ్య, పొన్నం తిరుపతిగౌడ్, మంగలి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్వోసీ అందజేత

శంకరపట్నం, జనవరి 13: శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన తనుకు విజయలక్ష్మి నిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా రూ.1.50లక్షల ఎల్వోసీ చెక్కును శనివారం అందజేశారు. బాధిత కుటుంబానికి ఆర్థికంగా ప్రభుత్వం నుంచి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఉప్పుగాళ్ల మల్లారెడ్డిలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు ఎంపీటీసీ రాజీనామా

గన్నేరువరం, జనవరి 13: మండలంలోని ఖాసింపేట ఎంపీటీసీ ఏలేటి సప్న చంద్రారెడ్డి శనివారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపినప్పటికీ వారు బీజేపీ సొంత గూటికి చేరనున్నట్లు మండలంలో ప్రచారం సాగుతున్నది. మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామాల పర్వం మొదలవడంతో రానున్న ఎంపీ ఎన్నికల వరకు అధిక సంఖ్యలో సర్పంచులు, ఎంపీటీసీలు బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీల్లో చేరడానికి సిద్ధం చేసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది.

నేటి నుంచి వీరభద్ర స్వామి ఉత్సవాలు

గంగాధర, జనవరి 13: గంగాధర మండలం కోట్ల నర్సింహులపల్లి వీరభద్ర స్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం గంగాజల సేకరణ, .ధ్వజశోభయాత్ర, విచిత్ర వేషాదారణ, నృత్యాలు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు, మంటప ప్రవేశం, గణపతి పూజ, స్వస్థిపుణ్యావచనం,అఖండ దీపారాధన, రక్షాబంధన్,అంకురార్పణ,అగ్నిప్రతిష్టమంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మల్లాచారి

ఇల్లందకుంట, జనవరి 13: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన ఊకంటి మల్లాచారిని నియమించినట్లు ఫోరం జిల్లా చైర్మన్ కుమారస్వామి శనివారం తెలిపారు. అనంతరం మల్లాచారి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాలస్థలంతో పాటు రూ. 25వేల నెలసరి పెన్షన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు అన్నం ప్రవీణ్, రాజిరెడ్డి, మహేందర్, ఆకుల రాజేందర్, శ్రీకాంత్, సంపత్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు మల్లారెడ్డికి ఆహ్వానం



గణేశ్‌నగర్, జనవరి 13: థాయ్‌లాండ్‌లోని చియాంగ్ మాయి యూనివర్సిటీలో ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు జరగనున్న నాలుగో ఆగ్నేయాసియా అంతర్జాతీయ విద్యా సదస్సులో ఎస్‌ఆర్ ఆర్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.కొత్తిరెడ్డి మల్లారెడ్డి పత్రసమర్పణ చేయనున్నారు. సదస్సు నిర్వాహకులైన చియాంగ్‌మాయి యూనివర్సిటీ, అంతర్జాతీయ అకాడమిక్ ఫోరం ఆహ్వానం పంపినట్లు మల్లారెడ్డి తెలిపారు. సదస్సులో పాల్గొనడానికి కళాశాల విద్యాశాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం నుంచి కూడా అనుమతి లభించినట్లు ఆయన తెలిపారు. నూతన విద్యా విధానం 2020లో భాగంగా ఉన్నత విద్యలో కరికులం క్రెడిట్ ఫ్రేమ్ వర్క్, వ్యవస్థాపన అభివృద్ధికి మార్గాలు అనే అంశంపై పత్రసమర్పణ చేయనున్నట్లు తెలిపారు. మల్లారెడ్డి అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పణకు ఎంపికైనందున ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, టిజిసిజిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కే.సురేందర్‌రెడ్డి, సంఘం జిల్లా బాధ్యులు ఏ.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు టి.రాజయ్య, టి.ప్రమోదకుమార్, వి.శ్రీనివాస్, పి.రాజు, పి.విశ్వప్రసాద్, కె.శారద, వి.కామరాజు, ఎ.నాగరాజు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 13: తెలంగాణ ప్రభుత్వం కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ అయిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) జపాన్, జర్మనీలలో నర్సింగ్ ఉద్యోగాల అవకాశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాల కోసం 22-30 సంవత్సరాల వయస్సు గల బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం డిప్లొమా హోల్డర్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి నెలకు లక్షా 50 వేల రూపాయల నుంచి లక్షా 80 వేల వరకు వేతనం ఇస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్, జర్మన్ భాషలపై శిక్షణ, అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలపై శిక్షణను హైదరాబాద్‌లో ఇస్తారన్నారు. వివరాలకు 8919047600, 9573945684, 6302292450 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

18న జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, జనవరి 13: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు జనవరి 18న జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటీఐ వద్ద ఉదయం 11గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల పదో తరగతి ఆపైన మార్కెటింగ్‌లో ఎంబీఏ, హెచ్‌ఆర్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ అగ్రికల్చర్, డిగ్రీ, డిప్లొమా విద్యార్హతలు కలిగిన యువతీ, యువకులు జాబ్ మేళాకు అన్ని సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో రావాలని తెలిపారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లోని కృషి విజ్ఞాన ఫర్టిలైజర్స్ కంపెనీలో పెద్దపల్లి జిల్లా పరిధిలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8985336947, 9502642441 నంబర్లలో సంప్రదించాలని ఆయన ప్రకటనలో సూచించారు.